వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం

- కమిషనర్ ఆదేశాలు బేఖాతర్
- దశాబ్దాల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు
- వీరే కాంట్రాక్టర్లు.. ఏ పనిచేయాలన్నా.. వీరి పాత్ర కీలకం
- కాని నెలలు గడుస్తున్నా ఇంత వరకు బదిలీ చేయని ఇంజినీరింగ్ అధికారులు
- వీరి బదిలీలు నిలిపివేయాలంటూ ఎమ్మెల్యేల నుంచి ఒత్తిళ్లు


నల్లకుంట పరిధిలో అనధికారికంగా వేసిన ట్యాప్ కనెక్షన్ తొలగిస్తున్న అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు దశాబ్దాలు తరబడి ఒకే స్థానంలో పనిచేయడంతో వీరు ఆడిందే ఆటగా...పాడిందే పాటగా మారింది. వీరిపై వస్తున్న తీవ్ర ఆరోపణలపై నగర కమిషనర్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు, ఇతర సిబ్బందిని బదిలీ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినా ఇంత వరకు బదిలీలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు.

బదిలీలు నిలిపివేయాలంటూ ఎమ్మెల్యే సిఫార్సులు..

గుంటూరు నగరంలో రెండు వేలకు మంది పైగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేయడంతో ఆయా ప్రాంతంలో వీరు చెప్పిందే శాసనం లాగా మారింది. ఇటు ఏఈల నుంచి అటు ఎమ్మెల్యేల వరకు కమీషన్లు తీసుకెళ్లి ఇచ్చేది వీళ్లే. వీరు చెప్పిన మాట ఏఈలు వినాల్సిన పరిస్థితి ఉందంటే వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాత్ర ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు చేస్తున్న కమీషన్ సేవలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యేలు వారిని బదిలీలు చేయవద్దని సిఫార్సులు చేస్తున్నట్లు సమాచారం.

ఇవిగో కొన్ని ఘటనలు..

- హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకుల్లో ఇద్దరు నాన్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రూ.కోటి పైగా వర్కులు చేయించుకుంటున్నారు.
- బీఆర్ స్టేడియం వాటర్ ట్యాంకుల్లో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ మూడు స్లార్లు సస్పెండ్ అయినా తిరిగి అక్కడే పోస్టింగ్ వేయించుకుని కాంట్రాక్టర్లకు పెట్టుబడి పెట్టించి పనులు చేయిస్తుంటారని వినికిడి.
- ఏటీ అగ్రహారం ట్యాంకుల పరిధిలో వీవీపీ రోడ్డులోని(లాల్‌పురం రోడ్డు) మెయిన్ రోడ్డులో ఉన్న ప్రధాన పైపులైన్(ఫీడర్ లైన్) నుంచి రోడ్డును కట్ చేసి మరి పలు భవనాలకు ఇద్దరు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు రూ.50 వేల చొప్పున తీసుకుని సుమారు పదుల సంఖ్యలో ట్యాప్ కనెక్షన్లు ఇచ్చినట్లు సమాచారం.
- ఎల్‌బీ నగర్ వాటర్ ట్యాంకుల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్, వాల్వ్ ఆపరేటర్లు సిల్ట్ వర్కులు చేయించడంతో పాటు, అనధికారంగా వాటర్ వాటర్ ట్యాప్‌లు ఇస్తుంటారని అందరికి తెలిసిందే...
- ఎల్ఎల్ఆర్ వాటర్ ట్యాంకుల్లో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓల్డ్ క్లబ్ రోడ్డులో డ్రెయిన్ల మీద ర్యాంపులు వేసినందుకు ర్యాంపులు తొలగించే కాంట్రాక్ట్ చేయించాడు. రూ.3 లక్షల వర్కుకి రూ.8 లక్షల బిల్లు పెట్టారని ఆరోపణలు.
- సర్కిల్ ఆఫీస్‌లో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏఈ అడ్డం పెట్టుకుని కాంట్రాక్ట్ పనులు చేయించుకుంటున్నాడు.
- రెడ్డిపాలెం వాటర్ ట్యాంకుల్లో 5 గురు సిబ్బంది ఎటువంటి జీతాలు లేకుండనే ట్యాప్ కనెక్షన్‌లు ఇస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు.

రూ.కోట్లల్లో పనులు

గుంటూరు నగరపాలక సంస్థలో జరిగే పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తుంటారు. అయితే ఈ టెండర్లల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పలు అభివృద్ధి పనుల్లో నాసిరకం మెటీరియల్ వాడుతూ బిల్లులు ప్రాసెస్ చేయించుకోవడంలో సిద్ధహస్తులనే చెప్పుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏఈలను మ్యానేజ్ చేయడంతో వీరికి సాటి ఎవరు లేరంటే అతిశయోక్తి లేదు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి

లక్ష్మీపురం: రాష్ట్ర రాజధాని, రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులపై నిరంతరం సమీక్ష చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా నెలకొన్న కార్మికవర్గ సమస్యలపై కూడా సమీక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మిక శాఖలో నెలకొన్న ఖాళీలను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్‌లో సుమారు 50 లక్షల మంది కార్మికులు గత పది సంవత్సరాలుగా పెరుగుదల లేని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష చేసి వారికి తక్షణమే వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక కొరత, సంక్షేమ పథకాలు అందక రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుపై కూడా ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. అధికారం చేపట్టి ఆరు మాసాలైనా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్మికులకు పెంచుతామన్న వేతనాలను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ పేరుతో ఆగని సూర్యనారాయణ అరాచకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించినా సంఘ అధ్యక్షునిగా చెప్పుకుంటున్న సూర్యనారాయణ అరాచకాలు, దొంగ నాటకాలకు ముగింపు పలకాలని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన క్యాదర్శులు పి.పవన్‌కుమార్, పి.అమ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మొహబూబ్ బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగిగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లే విధంగా అవినీతికి పాల్పడడంతో గత ప్రభుత్వం ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకున్న కారణంగా సంఘ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఆయనపై నమోదు చేసిన కోట్లాది రూపాయల కుంభకోణానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ ప్రస్తుత ప్రభుత్వం తొలగించినట్లు చెప్పుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. వాణిజ్య పన్నుల శాఖలో చేసిన వ్యవహారాన్ని సంఘానికి అంటగడుతూ నష్టం కలిగించడం మినహా, సంఘ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఏపీజీఈఏ పేరుతో ఈనెల 14న రాజమండ్రిలో సమావేశం అంటూ ఉద్యోగులను తప్పుదోవపట్టిస్తున్న బహిష్కృత అధ్యక్షుడు సూర్యనారాయణ మాటలు నమ్మిమోసపోవద్దని ఉద్యోగులకు సూచించారు.

సందేశాత్మకంగా విముక్తి నాటిక


నాటికలో ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం విముక్తి సాంఘిక నాటికను ప్రదర్శించారు. కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమి, నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సౌజన్యంతో ఉషోదయ కళానికేతన్ 18వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించారు. సభకు రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. గంజాయి, మత్తుపదార్థాల మత్తులో ఊగిసలాడుతున్న యువతకు విముక్తి కలిగించడమే నాటక సారాంశంగా నాటికను ప్రదర్శించారు. చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించారు. ఉషోదయ కళానికేతన్ కళా రంగానికి చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం కళాకారులను సత్కరించారు. ఏపీ ఎస్‌టీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, రంగస్థల సినీ, నటులు వై.ఎస్.కృష్ణేశ్వరరావు, వరికూటి శివప్రసాద్, కళాసౌధ అధ్యక్షుడు బిళ్ళ అశోక్, ఆరాధన ఆర్ట్స్ అధ్యక్షుడు డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, గరికపాటి వెంకటరామారావు, సయ్యద్ జానీబాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జ్యోతిరాణి, వేమేశ్వరి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోరం ఫర్ అంగన్‌వాడీ యూనియన్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు బుధవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయంలో కలసి సమస్యలను విన్నవించారు. సంక్షేమ పథకాలకు ఆటంకంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అన్న నిబంధనను సీఎఫ్ఎంఎస్ నుంచి తొలగించాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎలక్ట్రికల్ ఇండక్షన్ స్టవ్‌లు, పెండింగ్‌లో ఉన్న గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని విన్నవించినట్లు జ్యోతిరాణి తెలిపారు. పెండింగ్‌లో రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను 24 గంటల్లో వారి ఖాతాలకు జమ చేస్తామని డైరెక్టర్ చెప్పినట్లు వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఐ.వేమేశ్వరి, రాష్ట్ర ప్రతినిధులు విజయలక్ష్మి, పద్మకుమారి, అనిత, హెబ్సీబా పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి



ప్రత్తిపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, స్కూల్ గ్రంథాలయం, వంటగదితో పాటు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన శౌచాలయాన్ని పరిశీలించి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. పాఠశాలలో దాతల సహకారంతో సౌకర్యాలు సమకూర్చుతున్నామని ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, ఆమెకు వివరించారు. దీంతో ఆమె హెచ్ఎంను అభినందించారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పొన్నూరు: తెనాలి మండలంలోని మదర్‌థెరిస్సా నగర్, చినరావూరు తోటలో ఈ నెల 6వ తేదీన ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణం అంబేడ్కర్ నగర్‌లోని కవి డాక్టర్ కత్తి పద్మారావు కార్యాలయంలో ఆయనను కమిటీ సభ్యులు విగ్రహావిష్కరణకు ఆహ్వానించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన చలో తెనాలి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభ్యులు మాట్లాడుతూ తెనాలిలో భారీ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బెల్ట్ షాప్ రూ.50 వేలే!!

- రెండేళ్లు అంతా మీ ఇష్టం!
- అధికారులకు మామూళ్లు మామూలే
- గుట్టు చప్పుడు కాకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు
- ఊరికి నాలుగు షాపుల చొప్పున నిర్వహణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గుంటూరు రూరల్: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రైవేటుపరం చేసిన అనంతరం దుకాణాల యాజమాన్యం బెల్ట్ షాపులకు తెరతీశారు. మద్యం దుకాణాల్లో విక్రయాలు చేపట్టటంతో పాటు, దూరప్రాంతాలైన గ్రామాల్లో మద్యం ప్రియులకు బెల్ట్‌షాపుల ద్వారా మద్యాన్ని చేరువ చేసి మద్యం ప్రియుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మద్యం దుకాణాలను విరివిగా ఏర్పాటు చేశారు.

నగరానికి కూతవేటు దూరంగా రూరల్ మండలం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కు 5 కిలో మీటర్ల దూరం పాటించాలి. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు 11 గ్రామాల్లో కుదరకపోవటంతో గ్రామాల్లో మద్యం ప్రియులకు వైన్ షాపులు లేకున్నా బెల్ట్ షాపుల ద్వారా మద్యంను అందించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామానికి నాలుగు బెల్ట్ షాపులను గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించుకునేందుకు అధికారపార్టీ నేతలు వారి వైన్ షాపుల ద్వారా మద్యాన్ని అందిస్తూనే ఉన్నారు. శివారు గ్రామాలు, శివారు కాలనీలు ప్రధానంగా బెల్ట్ షాపుల నిర్వహణలో అధికార పార్టీ నేతలు బిజీగా ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు.

బెల్ట్ షాప్ కావాలంటే రూ.50 వేలు చెల్లించాలి

వైన్ షాపులు లేని గ్రామాల్లో బెల్ట్ షాపులకు మరింత గిరాకీ పెరిగింది. బెల్ట్ షాపును నిర్వహించుకోవాలంటే సంబంధిత గ్రామాల వైన్‌షాపుల యాజమాన్యానికి రూ.50 వేలు ముందుగా చెల్లించాలి. డబ్బు చెల్లించిన వారికి మాత్రమే వైన్ షాపు నుంచి మద్యం ఇస్తారు. వైన్ షాపులో ఎంఆర్‌పీ ధర రూ 100 ఉంటే దానిని బెల్ట్ షాపులో రూ.150కి విక్రయిస్తున్నారు. వైన్ షాపులు లేని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నేతలు బెల్ట్ షాపుల నిర్వహణ ద్వారా పేదల కష్టాన్ని మద్యం పేరుతో దోచుకుంటున్నారని గ్రామాల్లో చర్చాంశనీయంగా మారింది.

పట్టించుకోని అధికార యంత్రాంగం

వైన్ షాపుల ద్వారా బెల్ట్ షాపులను నిర్వహిస్తూ పేదల కష్టాన్ని కొల్లగొడుతున్నా కనీసం సంబంధిత అధికారులు మాత్రం మాకేం తెలియదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామాల్లో ప్రజలు అంటున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలే బెల్ట్ షాపులు నిర్వహిస్తూండటంతో అధికారులు మాత్రం చేసేదిలేక వారికి వచ్చే మామూళ్లతో మిన్నకుండి పోతున్నారని గ్రామాల్లో ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని పేదల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పన్ను చెల్లించని వారి ట్యాప్ కనెక్షన్ తొలగింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివాసాలు, వ్యాపార సంస్థలకు తొలుత ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీనివాసరావు తోట, నల్లపాడు రోడ్, ఆదర్శనగర్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో ట్యాప్ కనెక్షన్‌ని రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. నగరాభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పన్నుల చెల్లింపు కీలకమని, నగరంలోని పన్ను దార్లు సకాలంలో పన్ను చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి జీఎంసీ నుంచి అందించే మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రెయినేజీ కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగింపు కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీనివాసరావుతోట, నల్లపాడు రోడ్, కేవీపీ కాలనీ, నల్ల చెరువులోని పలు నివాసాలు, కమర్షియల్ సంస్థలు ఆస్తి పన్ను బకాయిలు పెండింగ్‌లో ఉండడం, పలుమార్లు బకాయిల చెల్లింపు చేయాలని తెలిపినప్పటికీ చెల్లించని కారణంగా మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లు తొలగించామని, తదుపరి కూడా స్పందించకుంటే విద్యుత్ కనెక్షన్, ఆర్.ఆర్. యాక్ట్ మేరకు జప్తు చేస్తామని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని: చెరువులో మృతదేహం లభ్యమైన ఘటన చోటు చేసుకుంది. మండలం ఉప్పలపాడులో ప్రధానరోడ్డు పక్కనే ఉన్న చెరువులో మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని చెరువులోని మృతదేహాన్ని బయటకు తీశారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుడి శవం బాగా ఉబ్బి ఉంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీ విభాగానికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి బుధవారం తెలిపారు.

క్లుప్తంగా

ఆచార్య ఈశ్వరరెడ్డికి తుమ్మల సాహితీ పురస్కారం



నగరంపాలెం: అమరజీవి తుమ్మల వెంకటరామయ్య సాహితీ పురస్కారం-2024ను యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు అధ్యాపకులు, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డికి ప్రదానం చేయనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీన విశాలాంధ్ర బుక్ హౌస్ ఉత్సవాల ప్రాంగణంలో నిర్వహించనున్న సత్కార సభలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జీఎం హరనాథరెడ్డి చేతుల మీదుగా ఈశ్వరరెడ్డికి పురస్కారంతో సత్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విచారణకు హాజరైన జీజీహెచ్ వైద్యులు

గుంటూరు మెడికల్: అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ వేధింపుల కేసులో బుధవారం గుంటూరు జీజీహెచ్ వైద్యులు ఒంగోలులో జరిగిన పోలీసుల విచారణకు హాజరయ్యారు. జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజులను పోలీసులు విచారించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



గుంటూరు వెస్ట్: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ 35 సంవత్సరాల ప్రభుత్వ సర్వీసులో ఉండి అనేక మంది కనీసం చిన్న ఇల్లు కూడా నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే స్థలాలు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం కనీసం కరవు భత్యం బకాయిలు కూడా చెల్లించలేదని, పీఆర్సీ ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. వైద్య చికిత్సను తమకు నెట్వర్క్ ఆస్పత్రులు అందించడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న అంశాల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చాంద్ బాషా తెలిపారు. అసోసియేషన్ నాయకులు కరీముల్లా, వై.నాగేశ్వరరావు, శ్రీనివాస్, నాగూర్ వలి, రత్తయ్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వికాస కార్యవర్గం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఉద్యోగ సంఘం(వికాస) బుధవారం బాధ్యతలు స్వీకరించింది. వికాస భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ కార్యవర్గం నుంచి భాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వీసీ కే గంగాధర రావు, రెక్టర్ కే రత్న షీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు నేలపాటి నాగేశ్వరరావు, తోట వెంకటేష్, కోశాధికారి కె.యేసయ్య, కార్యవర్గ సభ్యులు జి. శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు ఎన్.వెంకటేశ్వర్లు, ఈ శ్రీనివాసరెడ్డి, ఎస్.శ్రీనివాసరావు టంకశాల వెంకటేశ్వరరావు, సిహెచ్.సాంబశివరావు, చిమట ఆనంద్ పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



నగరంపాలెం: ఘంటసాల జయంతిని పురస్కరించుకుని కళా దర్బార్- అమరావతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాజ్ కూడలిలోని ఘంటసాల కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా హాజరైన మిరియాల ప్రసాదరావు మాట్లాడుతూ ఘంటసాల ఆలపించిన గీతాలు మరువలేనివని పేర్కొన్నారు. గాయని, గాయకులు కె.బాబూరావు, టి.సుధీర్‌బాబు, తొట్టెంపూడి రమేష్, నందిని, రాజశేఖర్, జమదగ్ని ఘంటసాల గీతాలు ఆలపించగా, ప్రేక్షకులను అలరించాయి.

రిటైర్డు ఎస్ఐలకు సత్కారం



నగరంపాలెం: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు ఎం.డేవిడ్‌రాజు, వి.రాధకృష్ణమూర్తి, సాధారణ బదిలీపై వెళ్తున్న ఏఆర్ డీఎస్పీ ఆర్‌పీఎల్ శాంతికుమార్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని అన్నారు. బదిలీపై వెళ్తున్న డీఎస్పీ శాంతికుమార్ విధుల్లో నైపుణ్యం ప్రదర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి(పరిపాలన), హనుమంతు(ఏఆర్), డీఎస్పీలు సీతారామయ్య(ఎస్‌బీ), ఏడుకొండలురెడ్డి(ఏఆర్), ఎస్‌బీ సీఐలు శ్రీనివాస్, రాంబాబు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

పరిశోధకురాలి ఫిర్యాదుపై విచారణకు ఆదేశం

ఏఎన్‌యూ: తనను అధ్యాపకుడు, పరిశోధకుడు వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరిశోధకురాలు దుర్గాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుతో శాఖా పరమైన విచారణకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పాల్ కుమార్ మంగళవారం లిఖితపూర్వకంగా కోరాడు. పరిశోధకురాలు అసత్య ఆరోపణలు చేస్తూ తన పరువుతో పాటూ యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిందని లేఖలో పేర్కొన్నాడు. ఈ ఘటనపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా తనను ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు, పరిశోధకుడు వేధింపులకు గురి చేస్తున్నారని పరిశోధకురాలు దుర్గాలక్ష్మి గుంటూరు ఎస్పీకి చేసిన ఫిర్యాదుపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసు అధికారి టి.భీమా శంకరరావును విచారణాధికారిగా నియమించారు.

పది మంది జూదరుల అరెస్టు

లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని విద్యానగర్ 3వలైనులోని ఓ లాడ్జిలో పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక లాడ్జిలో పది మంది పేకాటాడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి వచ్చిన సమాచారంతో దాడిచేశారు. పది మంది పేకాట రాయుళ్ల అరెస్ట్ చేశారు. తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం పరిశీలన



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని జిల్లా పంచాయతీ అధికారి బి.నాగసాయికుమార్ బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వర్మికంపోస్ట్ తయారీ గురించి ఆరా తీశారు. గ్రీన్ అంబాసిడర్ల పనితీరును మెచ్చుకుని వారిని సన్మానించారు. గ్రామ సచివాలయంలో స్వర్ణపంచాయతీ కార్యక్రమం నమోదు తదితర వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కే శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి లలితకుమారి, ఉపసర్పంచి మాధవీలత, సభ్యులు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.